క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటన

పిచ్చాటూరు: మండలంలోని రామగిరిలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం పర్యటించనున్నట్లు శ్రీ సుబ్రమణ్య ఆలయ పాలక మండలి చైర్మన్ కేవీఎల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆగస్టు 8, 9, 10 తేదీల్లో ఆలయంలో జరగనున్న ఆడికృత్తిక తెప్పోత్సవాల పోస్టర్లను ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఆవిష్కరిస్తారు.

నూతన సాంకేతికతతో బోధన



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రమణ్యం

ఏర్పేడు: నూతన సాంకేతికతతో ఇంగ్లిష్‌లో విద్యార్థులకు సులభ రీతిలో బోధించాలని ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండలంలోని బండారుపల్లె జెడ్పీ హైస్కూలులో ఇంగ్లిష్ బోధనపై మండల స్థాయి సీఆర్‌సీఈ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్యానల్ బోర్డు ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ఇంగ్లిష్‌పై పట్టు సాధించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. డిజిటల్ సాంకేతికతపై మెళుకువలను నేర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను తహసీల్దారు భార్గవి ఆదేశాలతో వీఆర్‌ఓలు భాస్కర్, తేజ బుధవారం సీజ్ చేశారు. వాటిని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని కాళంగి నదిలో ఇసుక రీచ్‌లు లేవన్నారు. అలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలించకూడదన్నారు. ప్రభుత్వ పనులు, ఇంటి అవసరాల కోసం ఏఈఈల వద్ద పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

శ్రీకాళహస్తి: పన్నులు సకాలంలో చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరారు. కమిషనర్ బాలాజీనాయక్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో పన్ను ల బకాయిల వసూళ్లకు మున్సిపల్, సచివాలయ సిబ్బంది బృందాలుగా వెళ్లి ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. పన్నులపై అవగాహన కల్పించారు. సకాలంలో పన్నులు చెల్లించకపోతే ప్రతి నెలా వడ్డీ పడుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. కుళాయి పన్నులు అధికంగా ఉన్న వారి ఇళ్లకు కనెక్షన్లను తొలగించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు నారాయణరెడ్డి, బాలచంద్రయ్య, రవికాంత్, ఇంజినీరింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటకృష్ణయ్య సేవలు చిరస్మరణీయం



అన్నదానం చేస్తున్న బొప్పన తిలక్‌బాబు

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొప్పన వెంకటకృష్ణయ్య సేవలు చిరస్మరణీయమని, పార్టీకి ఎనలేని సేవలు అందించిన వ్యక్తి నేడు మన మధ్య లేకపోవడం బాధాకరమని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి అన్నారు. వెంకటకృష్ణయ్య తృతీయ వర్ధంతి సందర్భంగా వరదయ్యపాళెంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద బుధవారం ఆయన తనయుడు రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు ఆధ్వర్యంలో వెంకటకృష్ణయ్య చిత్రపటానికి పలువురు పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, కార్యదర్శి లతీఫ్, సర్పంచ్ దుద్దు వేణు, బీఎన్‌కండ్రిగ ఎస్సీ సెల్ కన్వీనర్ గురవయ్య, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వ ల్ రెడ్డి, విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ విజేతకు సన్మానం



పెళ్లకూరు: ప్రపంచ ఆర్చరీ పోటీల్లో అండర్-18 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన తిరుమూరు గణేష్ మణిరత్నంను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధిశాఖ మంత్రి ఆర్‌కే రోజా బుధవారం సన్మానించి అభినందించారు. నాయుడుపేటకు చెందిన హరిప్రసాద్, సుప్రియ దంపతుల కుమారుడు గణేష్ మణిరత్నం ఇటీవల ఐర్లాండ్‌లో జరిగిన ప్రపంచ ఆర్చరీ పోటీల్లో అండర్-18 విభాగంలో రజత పతకం సాధించాడు.

పారదర్శకంగా పథకాలు అందిస్తున్నాం

- అర్హత ఆధారంగా సంక్షేమ ఫలాలు ఇస్తున్నాం
- సీఎం జగనన్న ప్రజల వద్దకే పాలన తెచ్చారు
- వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్నను ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా తీసుకుని పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్నామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం మండలంలోని రాజులకండ్రిగ, పోలినాయుడుకండ్రిగ గ్రామాల్లో మండలపార్టీ అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య అధ్యక్షతన ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన మొత్తాన్ని వివరించి సంక్షేమా బావుటా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నప్పటికీ ఏదైనా కారణం అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే స్థానిక ప్రజలకు సూచించారు.

30 సమస్యలు పరిష్కారం

గడప గడప కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే ఆదిమూలం దృష్టికి వచ్చిన తాగునీరు, డ్రైనేజీ, రోడ్డు మరమ్మతులు వంటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. నాలుగు గ్రామాల ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న పూడి, రాజులకండ్రిగ మధ్య వంతెన సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులను సంప్రదించి వర్షాలు ఎక్కువ కాకముందే తాత్కాలిక పరిష్కారం చూపుతామని, వచ్చే వేసవి కాలం నాటికి సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సంబరాల మధ్య ముగింపు

రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని 39 పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయింది. బుధవారం నాడు రాజులకండ్రిగలో కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా పార్టీ నేతలు, మండల ముఖ్యనేతలు, పలు విభాగాల నేతలు ఎమ్మెల్యే ఆదిమూలంకు ఘనస్వాగతం పలికారు. అలాగే రాజులకండ్రిగ దళితవాడ, పోలినాయుడుకండ్రిగ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు గజమాలలతో సత్కరించారు. 39 పంచాయతీల్లో గడప గడపకు కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి కావడానికి కృషి చేసిన మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఎమ్మెల్యే ఆదిమూలం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ధనుంజయరెడ్డి, ఉమెన్ కార్పొరేషన్ కోఆపరేటివ్ ఫైనాన్స్ రాష్ట్ర డైరెక్టర్ వసంతమ్మ, ముఖ్యనేతలు నందకుమార్, లాలుబాబుయాదవ్, శాస్త్రిరాజు, శ్రీనివాస్‌యాదవ్, మూర్తి సుబ్బన్న, గాలి దయాకర్‌నాయుడు, రమాదేవి, హరిబాబు, రమేష్, ఎంపీడీ ఓ రామచంద్ర, తహసీల్దారు శ్రీదేవి పాల్గొన్నారు.

పార్టీ జెండా ఆవిష్కరణ



కేవీబీపురం: మండలంలోని రాజులకండ్రిగ కూడలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ నేత లాలుబాబుయాదవ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం జరిగింది. అయితే మండలంలో ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి అయిన సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసయాదవ్, నేతలు నందకుమార్, శాస్త్రి రాజు, గాలి దయాకర్‌నాయుడు, దేవర్ల మణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేష్‌యాదవ్, మహిళా నాయకురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తప్పిదాలు లేకుండా ఓటర్ల జాబితా




మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు, హాజరైన బీఎల్‌ఓలు

- ఆర్డీఓ రామారావు

శ్రీకాళహస్తి: తప్పిదాలు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీఓ రామారావు ఆదేశించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశాలతో శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో ఆయన కమిషనర్ బాలాజీనాయక్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి బీఎల్వో ఇంటింటికీ వెళ్లాలన్నారు. 0 డోర్ నంబర్లను గురువారం సాయంత్రం లోపు గుర్తించాలన్నారు. ఒకే తలుపు నంబర్లపై పది కన్నా ఎక్కువ మంది ఓటర్లను గుర్తిస్తే అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 80-100 ఏళ్ల వారిని కూడా గుర్తించాలన్నారు. చిరునామాలో తప్పులు, మార్పులు ఉంటే అందుకు తగిన దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. ప్రతి సూపర్‌వైజరు బీఎల్వోలతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు

ఏర్పేడు: మండలంలోని పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కుస్తీ పోటీల్లో ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ బుధవారం తెలిపారు. రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో తమ స్కూలు విద్యార్థులు జ్యోతిప్రసాద్, విష్ణు, హర్షవర్ధన్, శ్రీను, నిరంజన్, పవన్, మునికుమార్, చెంగారెడ్డి, సూర్య 29న అనకాపల్లెలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వారిని పీడీ పుష్పవాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

మానవ అక్రమ రవాణా నేరం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ భీమారావు

శ్రీకాళహస్తి: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని డీఎస్పీ భీమారావు అన్నారు. ప్రపంచ బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినం పురస్కరించుకుని చైల్డ్ రైట్స్ అండ్ యు సహకారంతో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. బాలలు, మహిళల అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నారుల కోసం క్రై, ప్రగతి సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెలాఖరు వరకు శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తులసీరాం రెడ్డి, ప్రభాకర్, శిరీష, జయలక్ష్మి, వెంకటేష్, రామయ్య సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'కార్గిల్ విజయ్ దివస్'



కార్గిల్ దివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): స్థానిక ఎస్వీఏ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేసీ.రేణుకమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రిన్సిపల్ పి.సుధాకర్, సీనియర్ అధ్యాపకులు డి.బాబు, ఎస్.శ్రీహరి, సి.ఉదయలక్ష్మి ప్రసంగించారు. పాకిస్తాన్ మన దేశ సరిహద్దుల్లోకి చొరబడి, ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి భారత సైన్యం అసమాన పోరాటం చేసిందన్నారు. కార్గిల్ సెక్టార్‌లో పాక్ సైన్యాన్ని చిత్తుగా ఓడించి, మళ్లీ మన భారత దేశ పోస్టులపై భారత జెండాను ఎగురవేశారని, మన సైనికుల త్యాగాలను స్మరిస్తూ కార్గిల్ విజయ్ దివస్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ముఖ్యఅతిథులుగా మాజీ సైనికులు పులి శ్రీకాంత్, ఢిల్లీబాబు సైన్యంలో తమ అనుభవాలను, కార్గిల్ వార్‌లో భారత సైనికుల పోరాటాన్ని విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా వివరించారు. విద్యార్థినీ విద్యార్థులు కూడా ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలని కోరారు. అనంతరం మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు.

మహిళలను అవమానించిన వారిని శిక్షించండి



సత్యవేడు: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సత్యవేడు: మణిపూర్ రాష్ట్రంలో మహిళలను సమాజం సిగ్గుపడేలా అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ కోరారు. బుధవారం సత్యవేడు రామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక సీఐటీయూ నాయకులతో కలసి నిరసన తెలిపారు. కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కాంతమ్మ, భువన, నాగరాజ, భారతి, చందామరై తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలు



వరిపంటలో నిల్వ ఉన్న వర్షపు నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి వరి పంట దెబ్బతింది. మండలంలోని భవానీ శంకరపురం గ్రామంలో సుమారు 150 ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. కోత దశలో ఉన్న వరిపంట వర్షానికి నేలకొరిగింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలకు దెబ్బతిని తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోవడంతో మొలకలు వస్తున్నాయి. రైతులు ప్రసాద్‌నాయుడు, రమేష్, బాబు, మహేష్‌నాయుడు, సుబ్రమణ్యం, మణి, బత్తెయ్యతో పాటు పలువురికి తీరని నష్టం వాటిల్లింది. దీంతో వారు అప్పులు చేసి సాగు చేసిన పంట దెబ్బతినడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.





బీఎస్‌పురంలో నీట మునిగిన వరిపంట, నీట మునగడంతో మొలకెత్తిన వరిధాన్యం, బీఎన్‌కండ్రిగలో కురుస్తున్న భారీ వర్షం

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



ప్రజలకు లబ్ధి వివరాలను తెలుపుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, అయినా అందేవి కావన్నారు. అయితే తమ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పారదర్శక పాలనతో వలంటీరు వ్యవస్థతో ఇంటికే సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వాసునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మునిరెడ్డి, దుర్గారెడ్డి, సుధ, బలరాంరెడ్డి, గుడ్లూరు వెంకటరమణ నాయుడు, సుబ్రహ్మణం నాయుడు, ఉబ్బయ్య, మణినాయుడు, భాస్కర్‌రెడ్డి, ఢిల్లీబాబు, వెంకటేశు, రఘురాం, రమణారెడ్డి, రవీందర్‌నాయుడు, నాదముని, వేమాలయ్య, గరటారెడ్డి, షబ్బీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు

వరదయ్యపాళెం: గ్రామస్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల జేసీఎస్ కన్వీనర్ చిన్నా తెలిపారు. మండలంలోని వరదయ్యపాళెం-2 సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 746 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి పథకాలు అందని వారు ఇంకా ఎవరైనా ఉంటే జగనన్న సురక్ష సదస్సులో అర్జీలు ఇస్తే పరిశీలించి పథకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, స్థానిక సర్పంచ్ జ్యోతి, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, పంచాయతీ ఈఓ బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణార్జునుల ఊరేగింపు



పిచ్చాటూరు: పురవీధుల్లో దర్శనమిస్తున్న శ్రీకృష్ణుడు, ద్రౌపదీదేవి, అర్జునుడి ఉత్సవమూర్తులు

పిచ్చాటూరు: మండలకేంద్రం పిచ్చాటూరులో జరుగుతున్న ధర్మరాజుల స్వామి తిరునాళ్లలో భాగంగా బుధవారం శ్రీకృష్ణుడు, ద్రౌపదీదేవి, అర్జున ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. డప్పు, వాయిద్యాల నడుమ దేవతామూర్తుల ఊరేగింపు కనుల పండువగా జరిగింది. అలాగే సాయంత్రం హరేరామ, హరేకృష్ణ బృందం ఆలయం వద్ద భజన కార్యక్రమాలు చేపట్టాయి. ప్రజలు మంగళ హారతులతో ద్రౌపదీదేవి అమ్మవారికి స్వాగతం పలికారు. కంకణం ధరించిన భక్తులు అమ్మవారి సేవలో తరించారు. ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ద్రౌపదీ వస్త్రాపరణం ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్వరితగతిన లక్ష్యాలను పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: నవరత్నాల పథకాల ద్వారా ప్రభుత్వం చేపట్టిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, హౌసింగ్ ఏఈ, ఎంఈఓ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గడప గడప ప్రభుత్వం కార్యక్రమం నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సిబ్బందిపై ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 116 పనులు ప్రతిపాదించగా, ఇప్పటికి 16 పనులు పూర్తయ్యాయని, ఇంకా 100 పనులు పూర్తి చేయాల్సి ఉందని ఏఈ ఎంఎం దేవిప్రసాద్ తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 34 పనులు మంజూరు కాగా 30 పనులు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. హౌసింగ్ నిర్మాణాల్లో సత్యవేడు మండలం బాగా వెనుకబడి ఉందని ప్రోగ్రెస్ పెంచాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను కోరారు. వెల్ఫేర్, ఇంజినీరింగ్, మహిళాపోలీసులు నెలలో రెండు పర్యాయాలు తప్పనిసరిగా స్కూళ్లను తనిఖీ చేసి అవసరమైన వివరాలు తెలియజేయాలని ఎంఈఓ కే.రవి కోరారు. నాడు-నేడు ఫేజ్-2లో మంజూరైన స్కూళ్లు, అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారు



రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి శనివారం చందనాలంకరణలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. బుధవారం స్వామివారి స్వాతి నక్షత్రం కావడంతో ఉదయం శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, కల్యాణం నిర్వహించారు. సాయంత్రం బంగారు గరుడ వాహనంపై ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి అలంకరించి ఆస్థాన సేవ నిర్వహించారు.